# సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 2 । ఆగస్టు । 2024




**కళారూపాలు అబ్బురపరచాలి**

గిరిజన ఆచార వ్యవహారాలు, సహజత్వం ఉట్టిపడేలా చిత్ర కళారూపాలు అబ్బురపరచాలని పీఓ రాహుల్ సూచించారు. 8లో



**తాలిపేరుకు మళ్లీ వరద**

ఎగువన భారీ వర్షాలు కురుస్తుండటంతో తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు మళ్లీ వరద ఉధృతి పెరుగుతోంది. 8లో

**వాతావరణం**

గరిష్టం / కనిష్టం 30° / 25°

జిల్లాలో శుక్రవారం రోజంతా ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### జిల్లా రవాణాశాఖ అధికారిగా సదానందం



జి.సదానందం

కొత్తగూడెంటౌన్: జిల్లా రవాణాశాఖ అధికారి (ఆర్టీఓ)గా జి.సదానందంను నియమిస్తూ గురువారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ సౌత్ జోన్ పరిధిలో ఆర్టీఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన జిల్లాకు బదిలీపై వచ్చారు. గురువారం కొత్తగూడెంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయలో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఆర్టీఓగా పనిచేసిన పి.వేణు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి భద్రాచలం రవాణాశాఖ అధికారి టీ.కిషన్‌రావును ఇన్‌చార్జ్ ఆర్టీఓగా నియమించారు.

### బాధ్యతలు స్వీకరించిన జిల్లా మత్స్యశాఖ అధికారి



మహ్మద్ ఇంతియాజ్

పాల్వంచరూరల్: జిల్లా మత్స్యశాఖ అధికారిగా మహ్మద్ ఇంతియాజ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న వీరన్న వైరాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో నిజామాబాద్‌లో పనిచేస్తున్న ఇంతియాజ్ ఇక్కడకు వచ్చారు. చెరువులు, కుంటలకు నీరు పుష్కలంగా చేరడంతో ఈ నెలలోనే చేప పిల్లలను పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి తెలిపారు.

### గోదావరి తగ్గుముఖం

**మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ**

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. గురువారం ఉదయం 7:52 గంటలకు వరద నీటిమట్టం 42.90 అడుగులకు తగ్గడంతో ఆర్డీఓ దామోదర్‌రావు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. గురువారం వేకువజామున 6 గంటలకు 43.10 అడుగుల వద్ద ఉన్న గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుతూ 7 గంటలకు 43 అడుగులకు చేరుకుంది. క్రమంగా తగ్గుతూ ఉదయం 10 గంటలకు 42.20 అడుగులు, మధ్యాహ్నం 12 గంటల వద్ద 41.90 అడుగులు, 2 గంటలకు 41.60 అడుగులు, సాయంత్రం 4 గంటలకు 41 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం అశోక్‌నగర్ కొత్తకాలనీకి చెందిన 100 మంది మాత్రమే పునరావాస కేంద్రంలో ఉండగా, వారు కూడా శుక్రవారం ఇళ్లకు వెళ్లనున్నారు. కాగా గ్రామ పంచాయతీ సిబ్బంది ముంపు కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు.

### ఆర్‌అండ్‌బీ అధికారుల బదిలీలు

కొత్తగూడెంటౌన్: రహదారులు, భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ)లో గురువారం పలువురు అధికారులు బాధ్యతలు చేపట్టారు. గత నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా బదిలీలు జరిగాయి. ఈఈ బి.లాల్‌సింగ్ వికారబాద్ నుంచి భద్రాచలం డివిజన్‌కు బదిలీపై వచ్చారు. డీఈఈ ఏ.శ్రీనివాసరావు అశ్వారావుపేట నుంచి పీఏ టూ ఈఈగా మహబుబాబాద్ డివిజన్‌కు, పీఏ టూ ఈఈ డి.రమేష్ కొత్తగూడెం నుంచి ఆదిలాబాద్ డీఈఈగా బదిలీపై వెళ్లారు. ఏఈఈలు టీ.శివగణేష్ కొత్తగూడెం నుంచి చండ్రుగొండకు, వంశీ వీరేంద్ర పాల్వంచ నుంచి కొత్తగూడేనికి, ఏ.లకన్ నాయక్ చండ్రుగొండ నుంచి అన్నపురెడ్డిపల్లికి, బి.రాంబాబు టేకులపల్లి నుంచి మధిరకు, బి.హిందుమతి కొత్తగూడెం నుంచి ఖమ్మం సర్కిల్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. సూపరింటెండెంట్ జి.రమేష్‌బాబు కొత్తగూడెం డివిజన్ నుంచి కొత్తగూడెం సర్కిల్‌కు, టెక్నికల్ ఆఫీసర్ టీ.రమేష్ కొత్తగూడెం డివిజన్ నుంచి వరంగల్ సర్కిల్‌కు, సీనియర్ అసిస్టెంట్లు టీ.శ్రీనివాసరావు కొత్తగూడెం సబ్ డివిజన్ నుంచి ఇల్లెందుకు, డి.హరికృష్ణ ఇల్లెందు సబ్ డివిజన్ నుంచి వరంగల్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. వీరందరూ ఆయా స్థానాల్లో బాధ్యతలు స్వీకరించారు.

జూలూరుపాడు మండలంలో సాగుతున్న రాజీవ్ కెనాల్ నిర్మాణ పనులు



# పంద్రాగస్టుకు పొలం తడిసేనా..?

**ఆగస్టు 15 టార్గెట్‌గా సీతారామ ప్రాజెక్ట్ పనులు**

- లక్షన్నర ఎకరాలకు గోదావరి జలాలు అందిస్తామని ప్రకటించిన మంత్రులు
- ఒక్కో పంప్‌హౌస్‌లో రెండు మోటార్లు సిద్ధం
- ప్రధాన కాల్వ సిమెంట్ లైనింగ్ పనుల్లో జాప్యం



కమలాపురం పంప్‌హౌస్‌లో మోటార్లను సిద్ధం చేస్తున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎనిమిదేళ్లుగా సాగుతున్న సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రతిపాదికన చేపడుతోంది. ఆగస్టు 15 నాటికి పొలాలకు నీరు అందిస్తామని ప్రకటించింది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఆరంభంలో నాగార్జునసాగర్ ఆయకట్టు స్థిరీకరణకు ఏన్కూరు లింక్ కెనాల్ (రాజీవ్ కెనాల్) పనులకు శ్రీకారం చుట్టింది. పార్లమెంట్ ఎన్నికల హడావుడి ముగియగానే జూన్ 15న ఇరిగేషన్ శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 2024 ఆగస్టు 15 నాటికి రాజీవ్ కెనాల్ ద్వారా లక్షన్నర ఎకరాలకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తామని ప్రకటించారు.

**పంప్‌హౌస్‌ల్లో హడావుడి**

గోదావరి నదిపై కాటన్ నిర్మించిన ఆనకట్ట నుంచి రాజీవ్ కెనాల్ వరకు నీటిని తీసుకెళ్లాలంటే మూడు చోట్ల ఎత్తిపోయాల్సి ఉంటుంది. దీంతో అశ్వాపురం మండలంలోని బీజీ కొత్తూరులో 25 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 6 మోటార్లు, ములకలపల్లి మండలంలోని వీకే రామవరంలో 40 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 6 మోటార్లు, కమలాపురం పంప్‌హౌస్‌ల్లో 40 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మోటార్లు 5 ఉండగా, 25 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మోటార్లు 2 ఉన్నాయి. ఒక్కో పంప్‌హౌస్‌లో నీటిని ఎత్తి పోసేందుకు రెండు మోటార్లను సిద్ధం చేయాలని నిర్ణయించారు. అయితే మూడు పంప్‌హౌస్‌లలో అమర్చిన మోటార్లు చైనాకు చెందిన షాంగై ఎలక్ట్రికల్ కంపెనీవి కావడంతో ఆ దేశానికి చెందిన ఇంజనీర్ల సమక్షంలో ఈ పనులు చేపట్టాల్సి రావడం ఇబ్బందిగా మారింది.

**సివిల్ పనులపైనే**

అశ్వాపురం మండలంలో కాటన్ ఆనకట్ట మొదలు మూడో పంప్‌హౌస్ వరకు సుమారు డెబ్బై కిలోమీటర్ల మేరకు నీరు ఎత్తిపోతల ద్వారా తీసుకు రావాల్సి ఉంటుంది. అయితే ఈ డెబ్బై కిలోమీటర్ల కాలువ పనులు నాలుగేళ్ల కిందటే పూర్తయ్యాయి. అందులో వర్షపు నీరు నిలవడంతో దాన్ని మళ్లించేందుకు పాల్వంచ మండలంలో ఒకటి రెండు చోట్ల గండి పెట్టారు. వాటిని పూడ్చాల్సి ఉంది. కమలాపురం పంప్‌హౌస్‌కు ఇరువైపులా అనేక చోట్ల ప్రధాన కాలువకు సంబంధించిన సిమెంట్ లైనింగ్ పనులు ఇంకా పూర్తవలేదు. గడిచిన రెండు వారాలుగా వానలు కురుస్తుండటంతో సివిల్ పనుల్లో వేగం కొంత మందగించింది. ఇలాంటి ఇబ్బందులే రాజీవ్ కెనాల్ నిర్మాణ పనులకు ఆటంకం కలిగిస్తున్నాయి. అయితే ఆగస్టు 15ను టార్గెట్‌గా పెట్టుకుని రేయింబవళ్లు పనులు చేపడుతున్నారు.

**కృష్ణాతో గోదావరి పోటీ**

ఆగస్టులో సీతారామ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సాగునీటి పొలాలకు నీరందివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు రాజీవ్ కెనాల్ నిర్మాణంతో పాటు పంప్‌హౌస్‌ల్లోని మోటార్లను చకచకా సిద్ధం చేస్తోంది. మరోవైపు క్రమంగా నాగార్జున సాగర్ జలాశయంలో వరద నీరు చేరుకుంటోంది. దీంతో వైరా రిజర్వాయర్ కిందున్న ఆయకట్టుకు ఈసారి కృష్ణా జలాలు ముందు అందుతాయా లేక గోదావరి నీళ్లు చేరుకుంటాయా అనే ఆసక్తి నెలకొంది.

**ఒక్కో చోట రెండు మోటార్లు**

చైనా నుంచి ఇంజనీర్ల రాక ఆలస్యం కావడంతో ఇండియాలో తమకు సర్వీసులు అందించే నిపుణులను సీతారామ పంప్‌హౌస్‌ల దగ్గరకు షాంగై ఎలక్ట్రిక్ కంపెనీ పంపింది. ఆ తర్వాత ఆ కంపెనీ ప్రతినిధులు సైతం పని ప్రదేశాలకు చేరుకున్నారు. దీంతో గడిచిన నెల రోజులుగా మూడు పంప్‌హౌస్‌ల్లో నీటిని ఎత్తి పోసేందుకు వీలుగా రెండు మోటార్లను సిద్ధం చేస్తున్నారు. ఒక మోటారు పని చేయకపోయినా మరో మోటారుతో నీటిని నిర్విరామంగా తోడేలా పనులు చేపడుతున్నారు. ఇప్పటికే బీజీ కొత్తూరు, వీకే రామవరం పంప్‌హౌస్‌లలో ఈ పనులు పూర్తవగా నేడో రేపో కమలాపురంలో కూడా రెండు మోటార్లు ఎత్తిపోతలకు సిద్ధం కానున్నాయి.

## పంప్‌హౌస్–2లో ట్రయల్‌రన్ విజయవంతం



పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోస్తున్న గోదావరి జలాలు

ములకలపల్లి : మండల పరిధిలోని పూసుగూడెం శివారు వీకే రామవరంలో ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం (ఎస్ఆర్ఎల్ఐపీ) పంప్‌హౌస్–2 ట్రయల్‌రన్ ప్రక్రియ విజయవంతమైంది. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులోని పంప్‌హౌస్–1 నుంచి వచ్చిన గోదావరి జలాలను ఇక్కడి నుంచి ఎత్తిపోశారు. ఈ పంప్‌హౌస్‌లో 40 మెగావాట్ల సామర్థ్యంగల 6 మోటార్లు ఉండగా, ఒక్కో మోటారు 1,500 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తుంది. గురువారం ఓ మోటారుకు వెట్ రన్ నిర్వహించగా, విజయవంతమైందని ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. గోదావరి జలాలు ఇక్కడి నుంచి కమలాపురంలోని పంప్‌హౌస్–3కు వెళ్లాల్సి ఉంది. అయితే కమలాపురం ప్రధాన కాల్వకు సంబంధించి అక్కడక్కడా పనులు పూర్తికాలేదు. దీంతో పంప్‌హౌస్–2 నుంచి ప్రధాన కాలువ ద్వారా ముందుకుసాగి, సత్యంపేట శివారులోని పాములేరు వాగులోకి నీటిని వదిలారు. నీటిపారుదలశాఖ అధికారులు పూలుజల్లి, పసుపు, కుంకుమ వేసి గోదావరి జలాలను స్వాగతించారు.

**పదిరోజులుగా సాగుతున్న పనులు**

ట్రయల్‌రన్ కోసం పది రోజులుగా జపాన్‌కు చెందిన ఓ టెక్నీషియన్‌తోపాటు, సుమారు 20 మంది చైనా కంపెనీ అనుబంధ టెక్నీషియన్ల బృందం మోటార్ల మెకానిజంపై పని చేస్తోంది. రాష్ట్ర నీటిపారుదల శాఖ గౌరవ సలహాదారు పెంటారెడ్డి నేతృత్వంలో ఎట్టకేలకు గురువారం ట్రయల్‌రన్ నిర్వహించారు. ఇరిగేషన్ శాఖ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ సురేష్‌కుమార్, డీఈ మోతీలాల్, ఏఈ గఫూర్‌పాషా ఉన్నారు.

## కరకట్టలు నిర్మించాలి

**ముఖ్యమంత్రికి ఎమ్మెల్యేల విన్నపం**



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు

భద్రాచలం/బూర్గంపాడు: గోదావరి వరదల నుంచి భద్రాచలాన్ని రక్షించేందుకు కరకట్ట నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణలు సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందచేశారు. గురువారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో ముఖ్యమంత్రిని కలిసి ముంపు సమస్యను విన్నవించారు. ప్రతి ఏడాది వరదలతో ఏజెన్సీలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పక్కల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారానికి ఇరువైపులా కరకట్ట నిర్మాణం చేపట్టాలని కోరారు. ఇందుకు రూ.4 వేల కోట్లు మంజూరు చేయాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. కరకగూడెం, ఆళ్లపల్లి మండలాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మంజూరు చేయాలని, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 378మంది తెలుగు, హిందీ, పీఈటీ ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరినట్లు తెలిపారు.

### అజొల్లా సాగుపై అవగాహన

జూలూరుపాడు: అజొల్లా సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని డీఆర్డీఓ విద్యాచందన సూచించారు. స్థానిక పశువైద్యశాలలోని అజొల్లా ఫిట్‌ను ఆమె పరిశీలించి మాట్లాడారు. పశువులకు అజొల్లా మేత వేస్తే పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. పంటల సాగులో అజొల్లాను జీవఎరువుగా కూడా ఉపయోగించవచ్చన్నారు. అధికారులు కరుణాకర్ రెడ్డి, చలపతి, బానోత్ బద్దూలాల్, పూర్ణచందర్‌రావు, నరసింహారావు పాల్గొన్నారు.

# వీలుంటే తీస్తాం!

- ఇదీ జిల్లాలో రేషన్ డీలర్ల తీరు
- నిర్దేశిత సమయానికి తెరుచుకోని దుకాణాలు
- ఇదేమిటని ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తున్న వైనం
- విసిగిపోతున్న రేషన్ లబ్ధిదారులు



పాల్వంచ మండలం సోములగూడెంలో బోర్డు ఏర్పాటు చేయని రేషన్‌షాపు

కొత్తగూడెంఅర్బన్: రేషన్ డీలర్లు సమయపాలన పాటించకపోవడతో లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారు. డీలర్లు తమకు ఇష్టం ఉన్న, ఖాళీ సమయాల్లో రేషన్ దుకాణాలు తెరిచి బియ్యం పంపిణీ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లాలో 443 రేషన్ దుకాణాలు ఉండగా, దాదాపు అన్నింట్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇక కొన్ని రేషన్ దుకాణాలకు బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ఎవరైనా ప్రశ్నిస్తే బియ్యం ఇచ్చే సమయంలో కొందరు డీలర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

**బియ్యానికి బదులు నగదు!**

తెల్లరేషన్ కార్డు ఉన్న కుటుంబ సభ్యుల ఆధారంగా ఒక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది. అయితే ఇటీవల కొందరు రేషన్ బియ్యం తీసుకునేందుకు సుముఖత చూపకపోవడంతో డీలర్లకు కలిసివస్తోంది. లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా బియ్యానికి బదులుగా డబ్బులు పంపిణీ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. తద్వారా క్వింటాళ్ల కొద్దీ బియ్యాన్ని డీలర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. పట్టుకుంటే సివిల్ సప్లై అధికారులు, సిబ్బందిని మేనేజ్ చేసి మళ్లీ దందా కొనసాగిస్తున్నారు. దీంతో పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేయాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. రేషన్ బియ్యం లబ్ధిదారులకు చేరకుండా నేరుగా బ్లాక్ మార్కెట్‌కు తరలుతోంది. ఈ ప్రక్రియలో రేషన్‌డీలర్లు తక్కువ ధరకు కొనుగోలు చేసి మిల్లర్లకు, దళారులకు విక్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో జిల్లా కేంద్రంతో పాటుగా అన్నీ మండలాల్లో ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. అయినా పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారు.

**సమయపాలన లేదు..**

జిల్లాలో మొత్తం రేషన్ కార్డులు 2,93,632 ఉన్నాయి. ఇందులో అంత్యోదయ కార్డులు 18,822, ఆహారభద్రత కార్డులు 2,79,190 ఉన్నాయి. మొత్తం 443 రేషన్‌షాపులు ఉండగా, మున్సిపాలిటీల్లో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ బియ్యం పంపిణీ చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 7 గంటల వరకు రేషన్ బియ్యం పంపిణీ చేయాలి. కానీ రేషన్‌దుకాణదారులు సమయానికి షాపులు తెరవడం లేదు. దీంతో లబ్ధిదారులు నిరాశగా వెనుదిరిగిపోతున్నారు. ప్రభుత్వం బియ్యం ఉచితంగా ఇస్తున్నా ఒక్కో లబ్ధిదారుడు రెండు, మూడు సార్లు రావాల్సి వస్తోంది. ఇక మూడు, నాలుగు కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే లబ్ధిదారులపై చార్జీల భారం పడుతోంది. చాలామంది రేషన్ డీలర్లు, వారి బినామీలు వారి సొంత పనులు పూర్తి చేసుకున్న తర్వాతే తమకు తీరికగా ఉన్న సమయంలో షాపులు తెరిచి లబ్ధిదారులకు బియ్యం అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వం ప్రతి నెలా 5,411 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని జిల్లాకు సరఫరా చేస్తుండగా, అందులో ఎక్కువ మొత్తంలో పక్కదారి పడుతున్నాయి. అక్రమంగా బియ్యం తరలింపుపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటూ కేసులు నమోదు చేస్తున్నారు. కానీ పౌరసరఫరాల అధికారులు మాత్రం జనవరి నుంచి ఇప్పటివరకు కేవలం 40 కేసులు మాత్రమే నమోదు చేశారు. ఇంత తక్కువ సంఖ్యలో కేసులు నమోదు కావడమే సివిల్ సప్లై అధికారులు దాడులు, తనిఖీలు నిర్వహించడం లేదనే విషయాన్ని ధ్రువపరుస్తున్నాయి.

**ఒక్కొక్కరికి రెండు దుకాణాలు.. కానీ బోర్డులు కరువు**

జిల్లాలో పలుచోట్ల ఒక్కో డీలర్ రెండు దుకాణాల చొప్పున నిర్వహిస్తున్నారు. అధికారులకు ముడుపులు ముట్టజెప్పి బంధువులు, బినామీ పేర్ల మీద తీసుకుని రేషన్ షాపులు కొనసాగిస్తున్నారు. కొన్ని చోట్ల అవినీతి అవకతవకలతో రేషన్ డీలర్‌ను సస్పెండ్ చేస్తే, ఆ దుకాణాన్ని మరో డీలర్‌కు అప్పగిస్తున్నారు. దీంతో ఇదే అదునుగా డీలర్లు రెండు దుకాణాలు నిర్వహించాల్సి వస్తోందని పేర్కొంటూ ఎక్కడా సమయపాలన పాటించడంలేదు. పాల్వంచ మండలంలోని సోములగూడెం గ్రామ రేషన్ డీలర్‌ను కొద్ది నెలల క్రితం అవినీతి ఆరోపణలతో సస్పెండ్‌చేశారు. ఆ దుకాణాన్ని తొలుత పాండురంగాపురం డీలర్‌కు అప్పగించారు. ఆ తర్వాత నవభారత్ డీలర్‌కు అప్పగించారు. సదరు డీలర్ సమయపాలన పాటించడంలేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. సోములగూడెం రేషన్ షాపునకు కనీసం బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. సమీపంలోని మరో దుకాణం ఉండటంతో తికమక పడాల్సివస్తోందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

**నిర్దేశిత సమయంలో తెరవాలి**



రేషన్ డీలర్లు నిర్దేశించిన సమయంలో దుకాణాలు తెరిచి లబ్ధిదారులకు బియ్యం అందించాలి. డీలర్లు బియ్యం అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. లబ్ధిదారులకు అసౌకర్యం కలిగించకుండా బియ్యం పంపిణీ చేయాలి.

– రుక్మిణి, జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి

## తుమ్మల చెరువుకు జలకళ

**22 అడుగులకు చేరిన నీటిమట్టం**



నిండు కుండను తలపిస్తున్న తుమ్మల చెరువు

అశ్వాపురం: ప్రధాన సాగునీటి వనరైన కాకతీయుల కాలం నాటి తుమ్మలచెరువు నీటిమట్టం గురువారం 22 అడుగులకు చేరింది. మరో అడుగున్నర నీరు చేరితే చెరువు అలుగుపోస్తుంది. ఖరీఫ్, రబీ సాగు పూర్తయ్యాక చెరువులో 10 అడుగుల వరకు నీరు ఉండగా ఇటీవల వర్షాలకు మరో 12 అడుగుల నీరు చేరింది. చెరువు అలుగు పోస్తే చెరువు ఆయకట్టు కింద 10 వేల ఎకరాల్లో రెండు పంటలు సాగవుతాయి. ఖరీఫ్‌కు నీరు ఢోకా లేకపోవడంతో ఆయకట్టు కింద 10 వేల ఎకరాల్లో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. చెరువు నిండటంతో ఆయకట్టు రైతులు, వ్యవసాయ కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఆరోగ్య తెలంగాణలో భాగస్వామ్యం కావాలి

- తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్, డీడబ్ల్యూఓ విజేత తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రతి ఒక్కరూ ఆరోగ్య తెలంగాణ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు పట్టించాలని అన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను క్షేత్రస్థాయిలో షెడ్యూల్ ప్రకారం నిర్వహించి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. జిల్లా సంక్షేమాధికారి వేల్పుల విజేత, పోషణ అభియాన్ జిల్లా సమన్వయకర్త పానుగోటి సంపత్, జిల్లా ప్రాజెక్టు అసోసియేట్ బి.రాము, కోఆర్డినేటర్లు రామకృష్ణ, శ్రీకాంత్, సోనీ తదితరులు పాల్గొన్నారు.

**5 నుంచి స్వచ్ఛదనం–పచ్చదనం**

ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో నిర్వహించే స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం రాత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, ఇంకుడుగుంతల నిర్మాణం, మొక్కలు నాటడం, రోడ్లపై గుంతలు పూడ్చడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పల్లె ప్రకృతివనాలు, పార్కులు, వైకుంఠధామాలు, క్రీడాప్రాంగణాలలో పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయాలన్నారు. ప్రజలలో అవగాహన కోసం ర్యాలీలు, పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను గుర్తించాలని, కుక్కల నియంత్రణకు ప్రణాళిక రూపొందించాలన్నారు. నల్ల ఉసిరి, రణపాల, తిప్పతీగ, తులసి తదితర మొక్కలను తప్పకుండా నాటాలన్నారు. డీఎఫ్ఓ కృష్ణాగౌడ్, డీఆర్డీఓ విద్యాచందన, ఇరిగేషన్ ఈఈ అర్జున్, డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, పశుసంవర్ధక అధికారి పురంధర్, పరిశ్రమల శాఖాధికారి తిరుపతయ్య, డీపీఓ చంద్రమౌళి, బీసీ వెల్ఫేర్ అధికారి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ల బదిలీ


పాల్వంచ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ


ఇల్లెందు ప్రిన్సిపాల్ వై.చిన్నప్పయ్య

**పాల్వంచరూరల్:** మండల పరిధిలోని లక్ష్మీదేవి పల్లిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ వై.చిన్నప్పయ్య ఇల్లెందుకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.పి.పద్మ బదిలీపై వచ్చారు. గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. కాగా సాధారణ బదిలీల్లో కళాశాలకు అధ్యాపకులు రమేష్, మాధవి, కామేశ్వరరావు, కొండలరావులతో పాటు మరో ముగ్గురు నాన్‌టీచింగ్ స్టాఫ్ కళాశాలకు వచ్చారు.

### ఏకలవ్య పాఠశాలలో వివాదం

**దుమ్ముగూడెం:** మండలంలోని లక్ష్మీనగరం ఏకలవ్య మోడల్ పాఠశాలలో వివాదం చోటుచేసుకుంది. పాఠశాలలోని ఇంటర్ విద్యార్థులు కొందరు క్రమశిక్షణ తప్పడంతో వారిని వార్డెన్ మందలించాడు. దీంతో విద్యార్థులు కోపం పెంచుకుని సదరు వార్డెన్‌పై ఇటీవల దాడి చేశారు. వారిని గుర్తించి హోంసిక్ పేరిట ఇంటికి 10 రోజులు పంపించేందుకు హెచ్‌ఎం విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారిలో ఒక్కరిద్దరు విద్యార్థులనే ఇంటికి పంపించడంతో వారి తల్లిదండ్రులు హెచ్‌ఎంతో వాదనకు దిగారు. దీంతో విద్యార్థులు చేసిన దాడి విషయాన్ని వారి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై పాఠశాల హెచ్‌ఎం సురేఖను వివరణ కోరగా.. కొందరు విద్యార్థులు క్రమశిక్షణ తప్పారని, వారిని ఇంటికి పంపించడంతో భయం పెరిగి జాగ్రత్తగా ఉంటారని, మరోసారి ఇలాంటి ఘటనలకు పాల్పడకుండా ఉంటారనే ఉద్దేశంతో ఇలాంటి చర్య తీసుకున్నామని తెలిపారు.

### బాధ్యతలు స్వీకరించిన జీసీసీ మేనేజర్లు

**పాల్వంచరూరల్:** గిరిజన సహకార సంస్థ (జీసీసీ) బ్రాంచ్ మేనేజర్లు ముగ్గురు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇల్లెందు ఇన్‌చార్జ్ మేనేజర్‌గా ఉన్న పాల్వంచ బ్రాంచ్ మేనేజర్ లక్ష్మోజి పాల్వంచ రెగ్యులర్ స్థానానికి బదిలీ కాగా, భద్రాచలం బ్రాంచ్ మేనేజర్‌గా మహబూబ్‌నగర్ జిల్లా మన్ననూరులో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న జయరాజ్ బదిలీపై వచ్చారు. దమ్మపేట మేనేజర్‌గా ఆసిఫాబాద్ నుంచి కె.పాపారావు, దమ్మపేటలో పనిచేస్తున్న నర్సింహారావు ఇల్లెందు మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

### ఎస్సీల రిజర్వేషన్ శాతాన్ని పెంచాలి


మాట్లాడుతున్న వాసుమళ్ల సుందర్‌రావు

**అశ్వారావుపేటరూరల్:** పెరుగుతున్న జనాభా ప్రకారం ఎస్సీల రిజర్వేషన్ శాతాన్ని పెంచి, జాతీయస్థాయిలో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుమళ్ల సుందర్‌రావు కోరారు. గురువారం మండలంలోని వినాయకపురంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చి, ప్రచారపోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. ఈనెల 7, 8, 9వ తేదీల్లో ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తామని, మాలలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జక్కుల రాంబాబు, తోటమల్ల రమణమూర్తి, పల్లంటి రమేష్, జీవి రత్నం, దారా చిరంజీవి, రాజు, తుంపాటి రమేష్, పురేటి జగదీష్, జక్కుల నాగేశ్వరరావు, బొంతు శ్రీనివాస్ పాల్గొన్నారు.

### గోదాంలో అటవీ అధికారుల తనిఖీ

**జూలూరుపాడు:** మండల కేంద్రంలోని గోదామును గురువారం అటవీశాఖ అధికారులు తనిఖీ చేశారు. వెంగన్నపాలెంకు చెందిన ఓ వ్యక్తి పర్మిట్ టేకుకలప, ఇతర కలపతో ఫర్నిచర్ తయారు చేయించి విక్రయిస్తున్నాడనే ఆరోపణలు రావడంతో జూలూరుపాడు ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాద్‌రావు, సిబ్బందితో కలిసి గోదామును పరిశీలించారు. మంగళవారం, బుధవారం గోదామును పరిశీలించేందుకు వచ్చిన అటవీశాఖ అధికారులకు సంబంధిత వ్యక్తి అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లిన విషయం విదితమే. కాగా, ఆ వ్యక్తి గోదాం తలుపుల తాళాలు తీయడంతో అటవీ అధికారులు లోపలికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాద్‌రావు మాట్లాడుతూ.. గోదాంలో పర్మిట్ కలప, పనికి రాని కలపతోపాటు కొత్త టేకు కలప ఉన్నట్లు గుర్తించామన్నారు. సంబంధిత వ్యక్తి తన పొలంలోని ఐదు చెట్లను నరికి అందుకు సంబంధించిన కలపను తీసుకొచ్చి గోదాంలో భద్రపరిచారని, ఈ కలపకు పర్మిట్ లేని కారణంగా జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు.


**పామాయిల్ గెలలు**

| | |
|---|---|
| టన్ను ధర | రూ.13,705 |

# కళారూపాలు అబ్బురపరచాలి..

**నాయకపోడు, కోయ బొమ్మల తయారీ కేంద్రాన్ని సందర్శించిన ఐటీడీఏ పీఓ రాహుల్**


కళారూపాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్

**భద్రాచలం:** గిరిజన ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాల జీవనశైలి, సహజత్వం ఉట్టిపడేలా చిత్ర కళారూపాలను తయారు చేయాలని కళాకారులకు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. గురువారం ఐటీడీఏ ప్రాంగణంలోని నాయకపోడు, కోయ బొమ్మల తయారీ కేంద్రాన్ని ఆయన సందర్శించి బొమ్మలను పరిశీలించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ.. ఏజెన్సీ జీవనశైలి నేటి తరాలకు తెలిసేలా బొమ్మలు తయారు చేయాలన్నారు. భద్రాచలం వచ్చిన ప్రముఖులకు సహజత్వంగా ఉండే కళారూపాలను అందజేస్తే ఆదివాసీల సంస్కృతి వ్యాప్తి చెందే అవకాశం ఉందని పేర్కొన్నారు. భద్రాచలంలో తయారు చేసే ప్రతి కళారూపం, తయారీదారుల ప్రతిభ జాతీయస్థాయిలో ప్రతిబింబించాలని ఆకాంక్షించారు. సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్‌రాజ్, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుదాం**

భద్రాచలం ఐటీడీఏలో ఈ నెల 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని సమష్టిగా, అందరి సమక్షంలో ఘనంగా జరుపుదామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. గురువారం ఐటీడీఏ సమావేశ మందిరంలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలోని వివిధ ఆదివాసీ తెగల సంఘాల నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పీఓ మాట్లాడుతూ.. గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఈ వేడుకను ప్రభుత్వ ఆదేశానుసారం జరుపుతామని, అందరూ ఐకమత్యంగా ఉంటూ ఈ ఉత్సవాన్ని జయప్రదం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఐటీడీఏలో ఆదివాసీ గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ఛాయా చిత్రాల ప్రదర్శన శాల, ఆదివాసీ మహనీయులకు నివాళులు, ర్యాలీ తదితర కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. అన్ని ఆశ్రమ పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో సైతం జరపనున్నామని తెలిపారు. వివిధ ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, అధికారుల ఐక్య కార్యాచరణ కమిటీ నియమించి, ఆ కమిటీ సూచనల మేరకు జరిపే ఈ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్‌రాజ్, మేనేజర్ ఆదినారాయణ, వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మర్యాదగా వ్యవహరించాలి


భద్రాచలంఅర్బన్: ఆస్పత్రిలో బాలింతతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

**భద్రాచలంఅర్బన్:** ఆదివాసీ గిరిజన గ్రామాల నుంచి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి వైద్య పరీక్షల కోసం వచ్చే గిరిజనులతో వైద్యులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారికి సరైన వైద్యం అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. గురువారం భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి వార్డును పరిశీలించారు. గిరిజనులకు అందిస్తున్న వైద్యం గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణను అడిగి తెలుసుకుని మాట్లాడారు. వివిధ రకాల వ్యాధులతో మారుమూల గ్రామాల నుంచి ఆదివాసీలు వస్తుంటారని, వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. గర్భిణుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని, ప్రసవం అయ్యేవరకు అత్యంత అప్రమత్తతతో వ్యవహరించాలని చెప్పారు. అనంతరం వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. ఇంట్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అపరిశుభ్రత కారణంగా దోమలు వృద్ధి చెంది టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు సంక్రమిస్తాయని వివరించారు. కార్యక్రమంలో డేవిడ్‌రాజ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ఒత్తిడితోనే విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- పరామర్శించిన ఐటీడీఏ పీఓ
- సీనియర్ల వేధింపులే కారణమంటూ విద్యార్థిని వీడియో రికార్డ్

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలంలోని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని కటకం ఆశ్రిత ఇష్టం లేని కళాశాలలో చదవలేక మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యకు యత్నించిందని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. కళాశాలలో బుధవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన బాలికను భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గురువారం ఆయన పరామర్శించి తల్లిదండ్రులతో మాట్లాడారు. పదో తరగతి వరకు తెలుగు మీడియంలో చదివాక గురుకులంలో చేర్పించగా పూర్తిగా ఇంగ్లిష్ మీడియం కావడంతో సబ్జెక్టులు సరిగా అర్థం కాక తల్లికి చెప్పిందన్నారు. త్వరలోనే అధికారులతో మాట్లాడి మరో కళాశాలలో చేర్పిస్తానని ఆమె నచ్చజెప్పిందని.. ఇంతలోనే ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తెలిపారు. ప్రస్తుతం బాలికకు ప్రాణాపాయం లేదని, ఆమె కోరుకున్న కళాశాలలో ప్రవేశానికి అవకాశం కల్పిస్తామని పీఓ చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్‌రాజ్, గురుకులాల ఆర్‌సీఓ నాగార్జున్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**సీనియర్ల వేధింపులే కారణం..**

ఇంటర్ విద్యార్థిని ఆశ్రిత ఇష్టం లేని కళాశాలలో చదవడం ఇష్టం లేక ఆత్మహత్యకు యత్నించిందని అధికారులు తెలిపారు. మరోపక్క గురువారం మధ్యాహ్నం ఆమె మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కళాశాలలో సీనియర్ల వేధింపులతోనే ఆత్మహత్యకు యత్నించానని చెప్పిన ఆమె.. ఈ విషయాన్ని బయటకు రానివ్వకుండా కప్పిపుచ్చుతున్నారని వెల్లడించడం గమనార్హం. కానీ, ఆమెను ఆస్పత్రిలో పరామర్శించి తల్లిదండ్రులతో మాట్లాడిన ఐటీడీఏ పీఓ భద్రాచలం గురుకులంలో చదవడం ఇష్టం లేక ఆత్మహత్యకు యత్నించిందని తెలిపారు.

# ముగ్గురు మావోలు, సానుభూతిపరుడి అరెస్టు

**వివరాలు వెల్లడించిన ఎస్పీ రోహిత్‌రాజు**


మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు


మావోయిస్టుల నుంచి స్వాధీనం ఆయుధాలు

**కొత్తగూడెంటౌన్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, స్పెషల్ పార్టీ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన కూంబింగ్‌లో మావోయిస్టు ఏసీఎంస్థాయి నేతతో పాటు మరో ఇద్దరు మావోయిస్టులు, ఓ సానుభూతి పరుడిని అరెస్టు చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం తన కార్యాలయంలో ఎస్పీ రోహిత్‌రాజు వివరాలు వెల్లడించారు. జూలై 25న ములుగు – భద్రాద్రి జిల్లాల సరిహద్దు దామరతోగు అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో తప్పించుకున్న మావోయిస్టుల కోసం గుండాల పోలీసులు, స్పెషల్‌పార్టీ సిబ్బంది కూంబింగ్ నిర్వహిస్తుండగా దామరతోడు సమీపాన ఓ మహిళతో పాటు ముగ్గురు పురుషులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ముగ్గురు మావోయిస్టులు ఉండగా ఒక సానుభూతి పరుడు ఉన్నట్లు విచారణలో తేలిందని ఎస్పీ చెప్పారు.

**దళసభ్యుడి నుంచి ఏసీఎంగా..**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గొంద్ర గ్రామానికి పొట్టం రాజు అలియాస్ జోగా 2016లో మావోయిస్టు పార్టీ డీకేఎస్‌జెడ్‌సీలో దళ సభ్యుడిగా చేరాడు. 2022లో ఏసీఎంగా ఎదగడంతో తుపాకీ అందజేశారు. ఆయన తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లలో 42 హింసాత్మక ఘటనల్లో పాల్గొనగా ఇన్‌సాస్ తుపాకీ, 29 రౌండ్ల మ్యాగ్జిన్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇక బీజాపూర్ జిల్లా కోల్నార్‌కు చెందిన ఓయం పాండు అలియాస్ రమేశ్ 2021 డిసెంబర్ నుంచి మావోయిస్టు పార్టీలో పని చేస్తుండగా దక్షిణ బస్తర్ డివిజన్‌లో సెకండ్ సెంట్రల్ రీజినల్ కంపెనీలో దళ సభ్యుడిగా ఉన్నాడని.. 19 హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న ఆయన నుంచి 12 రౌండ్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వెల్లడించారు. అలాగే, ములుగు జిల్లా దూదేకులపల్లికి చెందిన పూనెం చుక్కి 2023లో మావోయిస్టు పార్టీలో మహదేవ్‌పూర్ ఏరియా కమిటీలో దళ సభ్యురాలిగా చేరగా.. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మూడు హింసాత్మక ఘటనల్లో పాల్గొన్నదని ఎస్పీ చెప్పారు. వీరికి తోడు దామరతోగుకు చెందిన మావోయిస్టు సానుభూతిపరుడైన శ్యామల ముకేశ్‌ను సైతం అరెస్ట్ చేసినట్లు ఎస్పీ రోహిత్‌రాజు వివరించారు.

# శాస్త్రీయ అవగాహన కల్పించాలి


కొత్తగూడెంరూరల్: మాట్లాడుతున్న చలపతిరాజు

**కొత్తగూడెంఅర్బన్:** విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన కల్పించే అంశాలపై శిక్షణ ఇవ్వాలని జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజు అన్నారు. గురువారం కొత్తగూడెంలోని ఆనందఖని రిసోర్స్ సెంటర్‌లో ఇన్‌స్పైర్ మనాక్–2024పై కొత్తగూడెం డివిజన్ పరిధిలోని సైన్స్, గణితం ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించగా ఆయన మాట్లాడారు. ప్రతి పాఠశాల నుంచి తప్పనిసరిగా ఐదు ప్రాజెక్టులు అప్‌లోడ్ చేయాలని, ఒక్కో పాఠశాల నుంచి ఉత్తమ ప్రాజెక్టును ఎంపిక చేసి విద్యార్థికి రూ.10 వేలు అందిస్తారని తెలిపారు. విద్యార్థులు స్వయంగా ప్రాజెక్ట్ రూపకల్పన చేసేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థికి ఐఐటీ విద్యాసంస్థల్లో రెండు శాతం రిజర్వేషన్ ఉంటుందని, జిల్లా నుంచి 1,500 ప్రాజెక్టుల రూపలక్పనే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కాగా, ఇన్‌స్పైర్ మనాక్ రిజిస్ట్రేషన్, ప్రాజెక్టుల రూపకల్పన, నూతన ఆవిష్కరణలపై డీఎస్‌ఓ బి.సంపత్‌కుమార్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో నాగరాజశేఖర్, జి.చంద్రశేఖర్, పి.సాయికృష్ణ, కె.వెంకటేశ్వర్లు, బి.రాజేశ్ పాల్గొన్నారు.

**పాల్వంచలో..**

**పాల్వంచ:** స్థానిక బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాల్వంచ, దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్ మనాక్ పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్వంచ ఎంఈఓ ఎ.శ్రీరామ్మూర్తి, జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతిరాజు, బి.సంపత్‌కుమార్, పి.సాయికృష్ణ, మంగమ్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేటకు చేరిన వరద రక్షణ సామగ్రి


తహసీల్దార్ కార్యాలయంలో వరద రక్షణ సామగ్రి

**అశ్వారావుపేటరూరల్:** ఇటీవల కురిసిన భారీ వర్షాలతో అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద గల పెదవాగు ప్రాజెక్టుకు వరద పోటెత్తి ఆనకట్టకు గండి పడిన సంగతి తెలిసిందే. వరద ప్రవాహం కారణంగా నారాయణపురం సమీపంలో 41 మంది చిక్కుకోగా, హెలికాప్టర్ సాయంతో వారిని సురక్షితంగా రక్షించిన విషయం విదితమే. ముందస్తు జాగ్రత్తలో భాగంగా వరద సహాయక చర్యల కోసం కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రానికి వరద రక్షణ సామగ్రిని సరఫరా చేయగా గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరింది. వరద ప్రమాదంలో రక్షించేందుకు 10 లైఫ్ జాకెట్‌లు, 10 లైఫ్ బోయ్‌లు, 25 మీటర్ల పొడవుగల రోప్ (తాడు)తోపాటు మరికొంత సామగ్రిని అందుబాటులో ఉంచామని తహసీల్దార్ కృష్ణప్రసాద్ తెలిపారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**అశ్వాపురం:** మండలంలోని అమ్మగారిపల్లి గ్రామ శివారులో గోదావరి ఒడ్డున గురువారం గుర్తుతెలియని మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో లభ్యమైంది. 55 ఏళ్ల వయస్సు కలిగిన పురుషుడు ప్యాంట్ మాత్రమే ఉండి కుడి చేతిపైన హిందీలో సత్యనారాయణ అని రాసి ఉండటంతోపాటు కుడి చేతి పైభాగంలో ఓం అనే గుర్తు ఉంది. మృతదేహాన్ని ఎవరైనా గుర్తుపడితే అశ్వాపురం పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

# మృతదేహంతో సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా


ప్రధాన రహదారిపై మృతదేహంతో ధర్నా చేస్తున్న దృశ్యం

**టేకులపల్లి:** మండలంలోని బిల్లుడుతండాలో బుధవారం రాత్రి విద్యుదాఘాతంతో భూక్య శ్రీను మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదే ఘటనలో తేజావత్ మోతీలాల్, ఐదేళ్ల బాలుడు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం మృతదేహానికి కొత్తగూడెం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం తర్వాత దానిని బొమ్మనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఉంచి ధర్నా నిర్వహించారు. మృతుడి కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని నినాదాలు చేశారు. ధర్నాతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. టేకులపల్లి, బోడు ఎస్‌ఐలు సురేశ్, శ్రీకాంత్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన విరమింపజేసేందుకు ప్రయత్నించగా నాయకులు, గ్రామస్తులు ససేమిరా అన్నారు. అనంతరం ఏఈ బుజ్జి కన్నయ్య, ఏడీఏ హేమచందర్‌తో నాయకులు, గ్రామస్తులు చర్చలు జరిపారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.5 లక్షలు వచ్చేలా కృషి చేస్తానని, గాయపడిన వారికి కూడా నష్ట పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వగా ఆందోళనకారులు ఒప్పుకోలేదు. మృతదేహాన్ని సబ్‌స్టేషన్ లోపలికి తీసుకెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఎట్టకేలకు పోలీసులు, నాయకులు, అధికారులు కలిసి చర్చలు జరిపి విద్యుత్ శాఖ తరఫున దహనసంస్కారాల కోసం రూ.30 వేలు ఎంపీటీసీ శంకర్ ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు అందజేయగా ఆందోళన విరమించారు.

### ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

**మణుగూరుటౌన్:** ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. మణుగూరు సురక్ష బస్టాండ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న బస్సును సమితిసింగారం మధ్యలో ఆపి డ్రైవర్ రతన్‌లాల్‌పై స్థానికుడు సుతారి వంశీ దాడి చేశాడు. నా కారుకే అడ్డు వస్తావా? అంటూ దుర్భాషలాడాడు. ప్రయాణికులు వంశీని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. డ్రైవర్‌ను 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు వంశీపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

### నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తులు అరెస్టు


నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

**పినపాక:** నాటుసారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గురువారం ఎక్సైజ్ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి కథనం ప్రకారం.. పినపాక మండలం తోగ్గూడెం శివారులో వాహన తనిఖీలు చేపట్టగా నాటుసారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. వారి వద్దనుంచి ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు ఆంజనేయులు, సతీశ్, ప్రసన్న పాల్గొన్నారు.

### పేకాట శిబిరంపై దాడి

**దమ్మపేట:** మండలంలోని అఖినేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటరాజపురం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటరాజపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి దాడి చేసి, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురు పారిపోయారు. వారి వద్ద నుంచి రూ.10,100 నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

### జ్వరంతో వ్యక్తి మృతి

**గుండాల:** పది రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఓ వ్యక్తి ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని చంద్రాపురం గ్రామానికి చెందిన కొర్సా కమల్‌హాసన్ (28)కు పది రోజులుగా జ్వరం వస్తోంది. దీంతో కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. తగ్గకపోవడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆయనకు కామెర్లు సోకడంతో చికిత్స పొందుతూనే పరిస్థితి విషమించి గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

### గాయపడిన వ్యక్తి..

**మణుగూరుటౌన్:** అంబేడ్కర్ సెంటర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సారపాకకు చెందిన ఇద్దరు వ్యక్తులు బుధవారం సాయంత్రం గాయపడిన విషయం విదితమే. కాగా, వారిలో బురాన్ మహేశ్ (25) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

### దొంగలు హల్‌చల్

**ఇల్లెందు:** మండలంలోని ఒడ్డుగూడెంలో బుధవారం రాత్రి శ్రీఆంజనేయ స్వామి ఆలయంలోని రూ.4 వేల నగదును అపహరించారు. గ్రామవాసి విష్ణువర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ రాజారత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, అర్ధరాత్రి ముకుందాపురంలోని వంశీ కిరాణంలో దొంగలు పడ్డారు. గల్లా పెట్టెలోని రూ.8 వేల నగదును చోరీ చేశారు. యజమాని గుగ్గిళ్ల రామారావు ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వాగు దాటి.. నాలుగు కిలోమీటర్లు నడిచి..

**ఆదివాసీ గ్రామంలో వైద్యసేవలు**


వాగు దాటుతున్న డాక్టర్, వైద్య సిబ్బంది


రాళ్లచెలకలో గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ తేజశ్రీ

**పాల్వంచరూరల్:** డాక్టర్, వైద్య సిబ్బంది వాగు దాటి, నాలుగు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి ఆదివాసీ గిరిజనులకు వైద్య సేవలందించారు. ఉల్వనూరు పీహెచ్‌సీ పరిధిలోని రాళ్లచెలక ఆదివాసీ గ్రామం దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంటుంది. ఆ గ్రామానికి వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు నడవాల్సిందే. దీంతో గురువారం ఉల్వనూరు పీహెచ్‌సీ డాక్టర్ తేజశ్రీ సిబ్బందితో కలిసి మామిడిగూడెం వరకు వాహనంలో వెళ్లి అక్కడ నుంచి కాలిబాటన నడుచుకుంటూ వాగుదాటి వెళ్లి వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 29 మంది గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 10 మందికి రక్తనమూనాలను సేకరించి పరీక్షించగా, ఇద్దరికి మలేరియా జ్వరం ఉన్నట్లు గుర్తించారు. మందులు పంపిణీ చేసి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది జేతూ, భీమా నాయక్, సురేష్, చైతన్యకుమార్, ఆశ కౌసల్య పాల్గొన్నారు.

# తాలిపేరుకు మళ్లీ వరద..

**25 గేట్ల ఎత్తివేత**


తాలిపేరు నుంచి విడుదలవుతున్న నీరు

**చర్ల:** తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్టుకు మళ్లీ వరద ఉధృతి పెరుగుతోంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టులోకి వరద పెరిగింది. 25గేట్లను ఎత్తి ఉంచి 55,993 క్యూసెక్కుల మేర వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గురువారం తెల్లవారుజాము వరకు ఎగువ నుంచి అంతగా వరద లేనప్పటికీ ఉదయం 6 గంటల నుంచి క్రమేపి పెరగడంతో 7 గంటలకు 5 గేట్లను ఎత్తి ఉంచి 12,196 క్యూసెక్కుల నీటిని దిగువలకు విడుదల చేశారు. 9 గంటలకు 11 గేట్లను ఎత్తి 20,874 క్యూసెక్కులు, మధ్యాహ్నం ఒంటిగంటకు 16 గేట్లను ఎత్తి 27,919 క్యూసెక్కులు, 3 గంటలకు 25 గేట్లను ఎత్తి 40,932 క్యూసెక్కులు, సాయంత్రం 5 గంటలకు 25 గేట్ల ద్వారా 55,993 క్యూసెక్కుల చొప్పున వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి భారీగా వరద వస్తోందని, ఇరువైపులా ఉన్న పెదమిడిసిలేరు, బి.కొత్తూరు, చినమిడిసిలేరు, దోశిళ్లపల్లి, భూముల్లంక, గుంపెన్నగూడెం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు అధికారులు హెచ్చరించారు.